# ఓడిపోయిన సావిత్రి

"జీవితం వొడుదుడుకులు లేకుండా సాగితే చాలు-," అన్న పరమార్థం సావిత్రికి రుచించలేదు. అందరికీ స్వార్థత్యాగం అబ్బాలనీ, వొకరి మంచి చెడ్డలు మరొకరు విచారించి తీరాలనీ, ఆవిడ అభిప్రాయపడేది.

సరైన జీవితన్ని అన్ని కోణాలనుంచి సమగ్రంగా అర్థంచేసుకోటానికి శాయశక్తులా ప్రయత్నంచేసి, తన విజ్ఞానమయమైన బుర్రకు పూర్తి విజయం చేకూరినట్లుగా భావించింది. కాని అప్పుడప్పుడూ అనుమానాలనేవి రాకుండ వుండేవి గాదు. అవి కలిగినప్పుడల్లా వాటిని తీర్చగల తాహతున్న మనుషులకోసం వెదికింది. చివరకు మాత్రం ఒక నిశ్చయానికి వొచ్చింది, అట్లాంటివన్నీ అనుభవంమీదనే అర్థంచేసుకోవటం సాధ్యంఅని.

సావిత్రికి కర్తవ్యం బోధపరచే వారొక్కరూ దొరకలేదు. బ్రతుకు బాటను గురించి ఆవిడకు కలిగే సందేహాలు వొకరు తీర్చటానికి వీలైనవి గావు. కాగా ఆవిడ ఆదర్శాలూ వుద్దేశ్యాలూ ఆవిడకే అర్థంకాని ధోరణిలో వున్నాయి. నిశ్చయంగా ఒక పని చేద్దామనుకుంటే, తీరా అది పూర్తయ్యేలోపలే లెక్కకతీతమైన సందేహాలు పొడసూపేవి. వాటినన్నింటినీ ఎదుర్కొంటూ, చివరివరకూ రాగలగటం సాహసం!

వితంతు వివాహాలు జరుగుతోనే వున్నాయి. తన్ను చేసుకోటానికెందరైనా యువకులు చంకలూ గుద్దుకుంటో వస్తారు, నిస్సందేహంగా! కాని వివాహంవల్ల తనకు శాంతి చేకూరుతుందా? ఆవిడ ఆశయం ప్రజాసేవ చెయ్యాలని. ఎట్లా చెయ్యాలో అర్థంగావటంలేదు. సలహా కోరిన పెద్దమనుషులు నలుగురూ, ఆవిడ మనసుకు సరిగా అతకని పనులు చెప్పారు. వాటిలో ఆమెకు నమ్మకం లేదు.

తన సమస్యలను పరిష్కరించుకోటానికి ఆవిడకు చరిత్రే ఆధారమయింది. ఒక్కసారి ప్రజాసేవ చేసిన మహిళలను గురుతుకు తెచ్చుకుంది. వున్నారు... లేకపోలేదు.

ఈ సేవ చేయటంలో ఎందుకు పురుషులే యింతవరకూ అగ్రస్థానాన్ని అవలంబిస్తో వచ్చారో ఆవిడకు తెలియలేదు. ఇంతకాలమూ నవీన సంస్కరణలమీద, మహిళా సమస్యలమీదా ఏన్నో రకాలుగా వుపన్యాసాలు యివ్వబడ్డప్పటికీ ఒక్కరూ ముందుకువొచ్చి నిల్చోలేకపోవటం స్త్రీజాతికే కళంకంగా తోచింది ఆవిడకు. ఇందుక్కారణం యేమయివుంటుంది? పురుషుడేం ఆటంకపరచలేదు గదా! అట్లా ఆటంకపరచినా బుద్ధిపుట్టితే మానివేయగలరోజులు పోయాయనే గట్టి నమ్మకం,ఆవిడకు. ఆ తప్పంతా ఆడవాళ్ళదే! జరిగిందేమో జరిగింది. గతజలసేతుబంధనంచేసి లాభించటానికి ఆశించటం తెలివితక్కువతనం! తనలాంటి వాళ్లో నలుగురు నడుమొడ్డి పనిచేస్తే చాలదూ? సమాజంలో లొసుగులు తారుమారు చేసి సంస్కరణ నూటికినూరుపాళ్ళూ తీసుకోవచ్చి, అందరి మనస్తత్వాలకూ అనుగుణంగా సమాధానాలు ఇస్తోంటే, ఇట్టే పనంతా పూర్తయి పోతుంది!

అయితే యేమిటి తను చేయవలసినపని? ఆలోచించవలసింది వివాహవిషయం. కొందరు యువతీమణులు వివాహం మానేసి సంస్కరణ ప్రారంభించారు. మరి కొందరు భర్తల్తో కాపురాలు చేస్తోనే, సమాజంలో తమపని చేస్తూ ఇదివరకు వాళ్ళకన్నా ఎక్కువే మార్పులు తేగలిగారు! కాబట్టి వివాహం విషయంలో యేమీ పట్టింపు కనిపించదు. కాని, ప్రస్తుత సాంఘిక పరిస్థితుల్ని జోడించి ఆలోచిస్తే, వివాహం మానుకోవటమే బుద్ధికి లక్షణంగా తోస్తోంది. ప్రజాసేవ, దేశసేవ చేయటానికి పెండ్లే మానుకుంటుంది. మాని? ఈ సేవ ఎట్లా జరుగుతుంది? మళ్ళీ చరిత్రే ఆధారమైంది ఆవిడకు! డాక్టరుగా బాగా సేవ చేయొచ్చు. కాని ఆ డాక్టరు హోదా సంపాదించటానికి పెట్టుబడి కావాలి! అర్థికంగా తను కుంటుబడ్డ మనిషి! నర్సుగా ట్రెయినింగ్ అయితే ఓ రకంగా ఆశయం నెరవేరుతుంది కాని అది హోదా అయిన పని గాదు. ప్రతి డాక్టరు దగ్గిరా ఓ నర్సు వుండటం, యీ నర్సులు ప్రజాభిప్రాయంలో దుర్మార్గత సంపాదించి వుండటం, ఆవిడ అనుభవం సూచిస్తోన్న విషయాలు! ఎంత సేవచేస్తోన్నా, బ్రతకడం ముఖ్యం గాబట్టి, ధనార్జన కేమీ లోటుండరాదు. తనకే ఎన్నో లక్షల డబ్బువున్నట్లయితే, నిస్సంకోచంగా వాటిని వినియోగించి వూరూరా తిరిగి ఆశయాలు నెరవేర్చుకునేదే! కాని ... నర్సుగా పనిచేస్తూమాత్రం, పరువుగా బ్రతికేవాళ్లెంతమంది లేరు? తన ఆదర్శాలు అడవిగాచిన వెన్నెలగాకుండా వుండాలంటే, అదేమార్గం!

సావిత్రి నర్సుగా రెండు సంవత్సరాలు పనిచేసింది గాని అందులో సుఖం కనిపించలేదు. ఆఫీసు వ్యవహారంలాగా ఒక ప్రత్యేక కర్తవ్యానికి అతుక్కుపోవటంలో మంచితనం ఆవిడకు కనిపించిందిగాదు. తనెక్కడో నర్సుగా పనిచేయడంవల్ల యేమి సాంఘిక ప్రయోజనం జరుగుతోంది?

దేనికయినా సాహసం అవసరం. సాహసించి మాత్రం తాను చేయగలిగిందేమిటో ఆమెకర్థం కాలేదు. నిజానికి తనకెవరైనా కర్తవ్యం బోధిస్తూ పనిచేయిస్తే, తన చాకచక్యం అంతా చూపించటానికి సిద్ధంగా వుంది సావిత్రి. అందు కనువయిన వాతావరణం యింతవరకూ యేర్పడనే లేదు. ఇకముందు నయినా యేర్పడగల అవకాశాలు కనిపించడం లేదు.

క్రమంగా నిరాశావాదం ఆవిడలో ప్రబలిపోయింది. చిన్నతనంలో అనుకున్న వొక్క ఘనకార్యాన్నీ నెరవేర్చలేకపోయింది. నిస్పృహ ఆవిడనావరించింది. ఏం చెయ్యాలో తోచని సావిత్రికి వివాహవాంఛ కలిగింది. స్త్రీకి అంతకన్నా వేరే పరమార్థం లేదేమో ననిపించింది! మరేవిధంగానూ రాణించగల తాహతు లేదేమో నిజంగా! గృహిణులుగా రాణిస్తున్న వనితల స్వరూపాలు సావిత్రి మెదడులో క్రమంగా సంచరించాయి!

ఒక రకంగా సావిత్రి జీవితం ప్రశాంతంగా భర్త చాటున జరిగిపోతున్నా ఆవిడకు అప్పుడప్పుడూ - "దేశసేవ చెయ్యటానికి, యేం చెయ్యాలి?" అన్న ప్రశ్న కలుగుతోంది. కాని దాన్ని బహిరంగ పరచటానికి మరీ సిగ్గుపడేది! ఆశయాలూ ఆదర్శాలూ ఆవిడను పరాజితను చేశాయి.

*(తెలుగు స్వతంత్ర)*